ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని గుమ్మకోట పంచాయతీ పరిధి గొట్టలపాడు గ్రామంలో తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కోయిల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యన గ్రావిటీ నుండి గ్రామం వరకు ఏర్పాటు చేసిన పైపులైన్ మరమ్మతుకు గురైందని, దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు తెలిపారు. అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాదుడే కరువయ్యారని తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పైపుల మరమ్మత్తు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు రాములమ్మ, .గంగమ్మ, పైడితల్లి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

క్రమశిక్షణతో చవివితే బంగారు భవిష్యత్తు

- కలక్టర్ సుమిత్ కుమార్

-జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

-1,66,709 మంది విద్యార్థులకు లబ్ధి

జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్నకలెక్టర్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు:క్రమశిక్షణతోనే ఉత్తమ విద్య నభ్యసించి బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవచ్చని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ విద్యార్థినీలకు హితబోధ చేశారు. సోమవారం పాడేరు మండలం కుమ్మరిపుట్టులో గల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాటశాలలో నిర్వహించిన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,910 పాఠశాలల్లో 1,66,709 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు., ప్రభుత్వ పాటశాలలలో కార్పోరేట్ పాటశాలలకు దీటుగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించటంతో పాటు శిక్షణ పొందిన ఉత్తమ ఉపాధ్యాయులను నియమించడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన విద్యా కిట్లను కూడా అందించటం జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. గిరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో ఉపాధ్యాయులపై మరింత భాద్యత ఉందన్నారు.

ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, పాఠశాలలు పుణ్ణప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారం, బూట్లు, షాక్స్, డిక్షనరీతో కూడిన బ్యాగులను పంపిణీ చేయటం గొప్ప విషయమన్నారు. విద్యార్థుల భవితపై ముఖ్యమంత్రికి ఉన్న ఆదరాభిమానాలకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు నాడు-నేడు కింద అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు.

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుతారని, వారికి నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నామన్నారు. పోటీ ప్రపంచంలో అందరితో పోటీ పడే విధంగా వారిని తీర్చి దిద్దాల్సిన భాద్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసారు. జిల్లాలో 2,910 పాఠశాలలో 1,66,709 మంది విద్యార్థులకు కిట్లు అందిస్తామని జిల్లా విద్యాశాఖాదికారి సలీం భాషా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, స్థానిక సర్పంచ్ సీతమ్మ, ఎంపిపి రత్నకుమారి, ఎంపిటిసి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాష, ఎటిడబ్ల్యుఓ రజని, మండల విద్యాశాఖాధికారి, పాటశాల ప్రదానోపాధ్యాయురాలు, తదితరులు పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ ప్రారంభం:

అరకులోయ:విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకుని వచ్చి మంచి భవిష్యత్తుకు పునాది వేయడానికి జగనన్న విద్య కానుక పంపిణీ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. జగనన్న విద్యా కానుక నాలుగో విడత కిట్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా అరకులలోని సిపిహెచ్ స్కూల్లో ఏర్పాటు చేసిన పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సహాయ కలెక్టర్ ఆశతో శ్రీవాత్సవ, డిడి కొండలరావు, ఎంపీపీ ఉషారాణి లతో కలిసి కిట్ల పంపిణీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరిచి విద్యనందించాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే నాడు- నేడు ద్వారా పాఠశాలల రూప రేఖలు మార్చారన్నారు.

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్ మాట్లాడుతూ, నాడు నేడుతో పాఠశాల ముఖచిత్రం మారిందని అన్నారు. నాణ్యమైన పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలను విధిగా బడికి పంపాలని 75 శాతం హాజరు ఉంటేనే అమ్మఒడిని ప్రభుత్వం ఇస్తుందన్నారు.విద్యార్థులు బాధ్యతగా చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు అన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీ వాత్సవ మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. పాడేరు డిడి కొండలరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భారతరత్న, ఎంపిపి రంజపల్లి ఉషారాణి, ఏటి డబ్ల్యు వో మల్లికార్జునరావు, ఎంపిటిసి భీమరాజు, హెచ్ఎంలు ఎల్‌బి.దయానిది, బాలాజీ పాల్గొన్నారు.

హుకుంపేట:- మండలం మఠం పంచాయతీ దురువీధి గ్రామం ఎంపియుపి పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యా కమిటీ చైర్మన్ చేతులు మీదుగా విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కేశవరావు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సూరారెడ్డి, పీఎంసీ చైర్మన్ సిహెచ్.వీరబాబు ఆధ్వర్యంలో నాలుగో విడత జగనన్న విద్యా కానుక కిట్లును ఎంపిపి గోము వెంకటలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడులో భాగంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిహెచ్ చంద్రరాణి, పాఠశాల ఉపాధ్యాయులు అర్జమ్మ, ఉదయ్ మనోహర్, గ్రామస్తులు రాణి, కె వీరబాబు విద్యార్థులు తల్లిదండ్రులు, పిఎంసి కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో చింతపల్లి సిఐ రమేష్, ఎస్ఐ రమణ

200 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అదుపులో తీసుకొని, వారి నుండి 200 కేజీల గంజాయిని సోమవారం చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధి అన్నవరం వద్ద చింతపల్లి ఎస్ఐ రమణ ఆధ్వర్యాన స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లి ఏఎస్పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... ఎస్ఐ రమణ పోలీస్ సిబ్బంది లోతిగెడ్డ బ్రిడ్జి వద్ద సోమవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. రాళ్లగడ్డ నుంచి లోతుగెడ్డ బ్రిడ్జి వైపు ఒక టీవీఎస్ స్కూటీపై ఇద్దరూ అతివేగంగా వస్తూ పోలీసులను చూసి వెనక్కి బండిని వెనక్కి తిప్పబోయి అదుపుతప్పి కింద పడిపోయారు. అక్కడే బండిని వదిలేసి పారిపోయారు. దీంతో అనుమానం వచ్చి వాహన తనిఖీలు చేయగా, అదే సమయంలో వస్తున్న రెండు కారులు పోలీసులను నిలిపివేసి, అందులో ఉన్న వారు పారిపోతుండగా పోలీసులు అప్రమత్తమై గోపిల్లి నవీన్, రుత్తల బోడకొండ అనే ఇద్దరిని అదుపులో తీసుకుని విచారించారు. కారులో గంజాయి రవాణా చేస్తున్నామని నిందితులు అంగీకరించారు. ఒక్కొక్క కారులో 100 కేజీలు గంజాయి చొప్పున 200 కేజీలు గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కార్లకు పైలెట్‌గా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులతో, కారులో వచ్చిన మరో ముగ్గురు మొత్తం ఐదుగురు పరారయ్యారు. నిందితుల వద్ద నుంచి 200 కేజీల గంజాయి, రెండు కార్లు, ఒక స్కూటీ, ఒక కీప్యాడ్ మొబైల్, 2000 రూపాయలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పరారైన ఐదుగురు నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతన్నట్లు ఏఎస్పి తెలిపారు. అరెస్ట్ అయిన ఇద్దరు వ్యక్తులపై గంజాయి కేసులు ఉన్నాయని చెప్పారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న ఎస్సై రమణ, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పి, చింతపల్లి ఎఎస్పి అభినందించారు. పట్టుబడిన నిందితుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్, ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి సెక్షన్ 11కెవి జడ్డంగి ఫీడర్ పరిధిలో మంగళవారంఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్డంగి గ్రామంలో జాతీయరహదారి ఎన్‌హెచ్516ఈ పనులు జరుగుతున్న నేపథ్యంలో రహదారికి ఇరువైపులా చెట్లు తొలగించడానికి జడ్డంగి సెంటర్ నుండి చైతన్యనగర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మన్యంలో భారీ వర్షం

-చెట్టు కూలడంతో గృహాలు ధ్వంసం

-పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. మండలంలోని కొత్తబల్లుగూడ పంచాయతీ సరన్నాయిగూడ గ్రామంలో వృక్షం కూలడంతో మూడు ఇల్లులు ధ్వంసం కాగా నలుగురుకి స్వల్ప గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వర్షం కురుస్తున్న సమయంలో పాంగి హేమ ఇంట్లో ఉండగా చెట్లు విరిగి పడటంతో తన తలపై బలమైన గాయం అయ్యింది. కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

అనంతగిరి:మండలంలో సోమవారం కుండపోత వాన కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక మండల వాసులు అవస్థలు పడుతున్నారుసోమవారం ఒక్కసారిగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది మండల కేంద్రంలోని వారపు సంతలో చిరు వ్యాపారస్తులు ఇబ్బందులకు గురయ్యారు.

సన్నాయిగుడ ఇంటిపై కూలిన చెట్టు

అనంతగిరిలో కురుస్తున్న వర్షం

చర్మవ్యాధి గ్రస్తురాలికి పరామర్శ

ప్రజాశక్తి అరకులోయ రూరల్:మండలంలోని ఇరగాయి పంచాయితీ బోందుగుడ గ్రామానికి చెందిన జన్ని ప్రమీలమ్మ (10) చర్మ వ్యాధితో బాధపడుతున్న విషయం పత్రికలో వచ్చిన కథనంపై కలెక్టర్ ఆదేశం మేరకు డిఎంహెచ్ఓ, మెడికల్ సిబ్బంది సోమవారం గ్రామంలో పర్యటించారు. చర్మ వ్యాధితో భాధ పడుతున్న జన్ని ప్రమీలమ్మ సమస్యను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మెడికల్ సిబ్బంది మాట్లాడుతూ చిన్నారికి మంచి వైధ్యం అందేలా చర్యలు తీసుకుంటామని, ఆర్థికంగా సహాయ సహాకారాలు అందించే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ విఆర్‌ఓ చిట్టిబాబు , గన్నెల పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-జి.మాడుగుల:ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు నాగమ్మ, లక్ష్మి సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. జి.మాడుగుల అంగన్వాడి యూనియన్ నూతన అధ్యక్షులుగా గిడ్డి మోదకొండమ్మ, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, కార్యదర్శిగా వరహాలమ్మ, కోశాధికారులుగా అన్నపూర్ణ, కాంతమ్మలను ఎన్నుకున్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

అక్రమ డెప్యూటేషన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఏజెన్సీ 11 మండలాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, మినీ గురుకులం, కస్తూర్బా గాంధీ పాఠశాలలలో రాజకీయ పలుకుబడితో వార్డెన్లు స్పెషల్ ఆఫీసర్లుగా జరిగిన అక్రమ డెప్యూటే షన్లను తక్షణమే రద్దు చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎస్టీ కమిషన్, తమకు అనుకూలమైన వారికి పాఠశాలల్లో అక్రమంగా డెప్యూటేషన్లపై నియమించు కుంటున్నారన్నారు. అక్రమ డెప్యూటేషన్లతో కేవలం డబ్బు సంపాదించుకోవడానికి తప్ప విద్యార్థుల బాగోగులు చూసే పరిస్థితి లేదన్నారు. తక్షణమే వీటిని రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య నాయకులు లక్ష్మణ్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెన్యూవల్ ఆర్డర్ జారీ చేయాలి

ప్రజాశక్తి- పెదబయలు:రాష్ట్ర గిరిజన సంక్షేమ కళాశాల పాఠశాలల్లో తక్షణమే ఉపాధ్యాయులకు రెన్యూవల్ ఆర్డర్ విడుదల చేయాలని ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకు కళాశాలలు తెరచి వారం రోజులైనా రెన్యూవల్ ఆర్డర్ కాపీ గురుకుల అధికారులు జారీ చేయలేదన్నారు. రెండు నెలలుగా వేతనాలు సారి సరైన సమయంలో విడుదల చేయలేదన్నారు. రెన్యూవల్ ఆర్డర్ విడుదల చేయక పోవడంతో విధులకు వెళ్లాల్లా వద్దా అనే సంధిగద్ధంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారన్నారు.

టిప్పర్‌ను ఢీ కొన్న బైక్

ప్రజాశక్తి-పెదబయలురూరల్:మండలంలోని గలగండ సమీపంలో కొత్తకోట గ్రామానికి చెందిన ఫైనాన్సియల్ వ్యాపారి కె.సుబ్బరామకృష్ణ బైక్‌పై వెళుతూ టిప్పర్‌ను ఢీ కొన్నాడు. వ్యాపారికి తీవ్ర గాయాలు అయ్యాయి. అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

సెల్ సిగ్నల్స్‌పై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో భీమవరం గ్రామంలో రిలయన్స్ జియో నెట్వర్క్ టవర్‌ను ఇటీవల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సెల్ టవర్ నిర్మాణం పూర్తి చేసి సిగ్నల్ అందుబాటులోనికి తీసుకొని వచ్చారు. ఈ నేపథ్యంలో సిగ్నల్ వ్యవస్థ పనిచేసే తీరును జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ సోమవారం పరిశీలించారు. భీమవరం గ్రామంలో పర్యటించిన కలక్టర్ ముందుగా అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి సిగ్నల్స్‌పై ఆరాతీశారు. స్థల దాత, సర్పంచ్ సన్నిబాబుతో మాట్లాడారు.కలక్టర్ స్వయంగా వీడియో కాల్ చేసి మాట్లాడి సిగ్నల్ నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. ఆయన వెంట తహసిల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ వెంకటరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎఇఇ ధృవకుమార్, సర్పంచ్ సన్నిబాబు ఉన్నారు.

14న సికిల్‌సెల్ ఎనీమియా టెస్ట్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు : ఈ నెల 14న జిల్లాలో సికిల్‌సెల్ అనీమియా పరీక్షల కిట్ల పంపిణీని స్థానిక కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఆవరణలో లాంచనంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రారంభానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి విడదల రజని వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు సభా వేదిక, ఏర్పాట్లను కలక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, ఇదివరకు సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు రెండు దఫాలుగా చేసేవారని, తుది పరీక్ష విశాఖపట్నంలో జరిగేదని తద్వారా ఫలితం తెలుసుకోవటానికి సమయం పట్టేదని తెలిపారు. ప్రస్తుతం అందిస్తున్న ఈ కిట్లతో అప్పటికప్పుడే ఫలితం తెలిసిపోతుందని వివరించారు. సభ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ కార్య నిర్వాహక ఇంజినీర్ రాజును ఆదేశించారు.

ముందస్తుగా వరద సహాయక చర్యలు చేపట్టండి

- సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

- చింతూరు ఐటిడిఎకు రెగ్యులర్ పిఒను నియమించాలని డిమాండ్

చింతూరు ఐటిడిఎ వద్ద ధర్నా అనంతరం వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చింతూరు

రానున్న జూలై, ఆగస్టు నెలలో వచ్చే వరదలకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు. సీసం సురేష్, పల్లపు వెంకట్ మాట్లాడుతూ గతేడాది వరదల వల్ల నిర్వాసితులు తీవ్ర ఇబ్బంది పడ్డారని, అందువల్ల ఈ ఏడాది వరద ప్రమాద హెచ్చరికలను ముందుగానే తెలియజేస్తూ ఉండాలని కోరారు. వరదల సమయంలో వాహనాలు, రవాణా సౌకర్యం కల్పించి తరలించాలని, ముందుగానే పడవలను లాంచీలను గ్రామాల వద్దకు చేర్చి ఉంచాలని, వరద బాధితులకు సరిపడా ముందస్తు షెల్టర్లు ఏర్పాటు చేయాలని, షెల్టర్లు, జనరేటర్లు, కిరోసిన్, కొవ్వొత్తులు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన చటి నుండి సింగన్నగూడెం రెడ్ క్రాస్ వరకు, తుమ్మల, వేకవారిగూడెం మీదుగా బురదగుడం వరకు, కుందులూరు నుండి కొండపల్లి గమలకోట చదలవాడ మీదుగా తులసిపాక వరకు, ఏడుగురాళ్లపల్లి నుండి తాటిలంక మీదుగా బొదునూరు కోతులుగుట్ట వరకు, కూనవరం మండలం పొట్లవాయ గూడెం నుండి బొదునూరు వరకు రోడ్లు వేయాలని, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చింతూరు ఐటిడిఎకు పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారిని నియమించాలని కోరారు. అనంతరం ఐటీడీఏ అధికారికి డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, పల్లపు పెద్ద రాములు, శ్యామల తమ్మయ్య, పాండు చిన్న నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : వరద సహాయక చర్యలు ముందస్తుగా చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐ వి మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో గత వరదల సమయంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తుగా చేపట్టాలన్నారు. ఎఎన్ఎంలకు, హెల్త్ వర్కర్లకు, అంగన్వాడీలకు హెల్త్ ట్రైనింగ్ ఇవ్వాలని, పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకిశెట్టి రాము, సోయం వీరమ్మ, నూతలపాటి సుధాకర్ రావు, అపకా సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా ప్రతినిధుల నిరాహార దీక్ష

విఆర్.పురం : ముందస్తుగా వరద సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఆ పార్టీ ప్రజాప్రతినిధులు సోమవారం విఆర్.పురం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఎంపిపి కారం.లక్ష్మితో పాటు సిపిఎం సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులకు సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు పూలదండలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని రామవరం, ములకనపల్లి, పెద్దమట్టపల్లి, రేఖపల్లి, శ్రీరామగిరి, జీడిగుప్ప ప్రాంతాలలో బఫర్ స్టాక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో మండల కేంద్రంలో కరెంట్ లేకపోవడం వల్ల ప్రజల నుండి అధికారులు సమాచారం తెలుసుకోవాలన్నా సాధ్యం కావడం లేదని, అందువల్ల చింతూరు నుంచి కుందులూరు మీదుగా పాత విద్యుత్ లైన్ ఉండేదని, ఆ లైన్‌ను పునరుద్ధరించి పెద్దమట్టపల్లి, రేఖపల్లి, వరకు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వరదలకు నష్టపరిహారం ఇవ్వని కుటుంబాలకు తక్షణమే చెల్లించాలన్నారు. సాయంత్రం మండల తహశీల్దారు ఎన్.శ్రీధర్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. పై డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, వెట్టి లక్ష్మి, పూనెం సరోజిని, గొల్లగూడెం వార్డు సభ్యులు కట్టం లక్ష్మి, నాళ్లరపు భారతి, పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామూర్తి, వడ్లది రమేష్, కారం సుందరయ్య, కుంజ నాగిరెడ్డి, చిక్కాల రామారావు, నాళ్లరపు ప్రకాశరావు, కుర్షం నాగేశ్వరరావు, ఆసు లక్ష్మయ్య, ముసలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

విఆర్.పురంలో ప్రజా ప్రతినిధుల నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సిపిఎం నేత పూనెం

స్పందనకు 43 దరఖాస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రంపచోడవరం పరిధిలో మండలాల నుంచి 43 దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. రంపచోడవరం మండలం పోక్స్‌పేట గ్రామంలో తమ భూ సమస్య పరిష్కరించాలని కారం నరసాయమ్మ అర్జీ ఇచ్చారు. తాను టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాయని, సిఆర్‌టి ఉద్యోగం ఇప్పించాలని వై రామవరం మండలం చాపరాయి గ్రామానికి చెందిన పీవీ భూపతి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి గ్రామంలో చాలా ఏళ్ల నుండి కొండపోడు వ్యవసాయం చేసి జీవిస్తున్నామని, తమకు పోడు పట్టా మంజూరు చేయాలని మద్దేశు గంగరాజు విన్నవించారు. పందిరి మామిడి జంక్షన్ నుండి చవిటి దిబ్బలు గ్రామం మధ్యలో భీమవరం, నరసాపురం గ్రామాలలో 7 కిలోమీటర్ల మేరకు ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేసి, రోడ్డు పూర్తి చేయాలని ఎంపీటీసీ బచ్చల మంగమ్మ దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, నాగేశ్వరరావు, రీజనల్ మెడికల్ ఆఫీసర్ ఓ.బి.ఇందిర, వెలుగు ఏపిడి ఏ.శ్రీనివాసరావు. ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్‌కెవి చౌదరి, సావిత్రి, ఏఎంవో సి.శ్రీహరి, ఏడిఎంహెచ్ఓ డాక్టర్ రాధి గోపిక, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అల్లాడి వెంకటేశ్వరరావు, సాయి సతీష్, రాజేంద్ర బాబు, దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దారు రవీంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, సిడిపిఓ సంధ్యారాణి, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

పోషకాహార పునరావాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

పోషకాహార పునరావాస కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ : చిన్నారులకు మెరుగైన ఆరోగ్యం కోసం పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్ ఆర్‌సి)లు ఎంతగానో దోహద పడతాయని పాడేరు ఐటిడిఎ పీవో వి. అభిషేక్ అన్నారు. సోమవారం అరకులోయ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవత్సవ తో కలిసి పిల్లలకు అమర్చిన పోషకాహార కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, ఎదుగుదల లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మంచి పోషకాహారం అందించి వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన చిన్నారులకు ప్రత్యేక వైద్య సహాయం అందించాలన్నారు. ఆసుపత్రిలో చేరి మధ్యలో వెళ్లిపోకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు నిర్దిష్టమైన ప్రమాణాల స్థాయికి పెరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు ఎన్ ఆర్ సి సెంటర్లో 14 రోజులపాటు ఉంచితే పౌష్టికాహారం అందించి బరువు పెరిగే విధంగా నిర్వాహకులు చూస్తారని ఆయన స్పష్టం చేశారు. రెండున్నర కేజీలకు తక్కువ గా బిడ్డ పుడితే పౌష్టికాహార లోపం బిడ్డగా పరిగణించి ఎన్ ఆర్ సి సెంటర్లకు పంపించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, సిబ్బంది, ఐసిడిఎస్ పీవో సూపర్వైజర్లు, అంగన్వాడీలతో సమీక్షించారు.శాసనసభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, గిరిజనులు ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, శిశు అధికారి సుబ్రహ్మణ్యం, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, హరి, నాయక్, సిడిపిఒ శారద, సూపర్వైజర్లు, అరుణ శ్రీ, లక్ష్మి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముగిసాయి. గత నెల 10వ తేదీ నుండి ఈ నెల 10వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సుమారు 50 క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. సోమవారం క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న గ్రామ శిక్షణ శిబిరాల కోచ్‌లకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీ వాస్తవ, క్రీడా సామాగ్రిలను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడా శిక్షణ శిబిరాలను సువ్యవస్థితంగా నిర్వహించిన జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ. జగన్ మోహనరావుకు అభినందనలు తెలియజేశారు.

గిరిజనులకు డోలీలే శరణ్యం

ప్రజాశక్తి -అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం అందుబాటులో లేక పోవడంతో గర్భిణిలకు, రోగులకు డోలీ మోత తప్పడం లేదు.మండలంలోని నాన్ షెడ్యూల్ మారుమూల రొంపల్లి పంచాయతీ బూరిగా గ్రామానికి చెందిన సోమ్మెల చిన్నమ్మ 9 నెలల గర్భిణి. పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం సోమవారం బూరిగ గ్రామం నుండి విజయనగరం జిల్లా మెంటాడ ప్రభుత్వ ఆసుపత్రికి కొండ కోనల మధ్య నుండి సుమారు 8 కిలో మీటర్లు మెంటాడ మండలంలో వాజిజ గ్రామానికి చేర్చారు. అక్కడ నుండి ప్రైవేటు వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించామని కుటుంబ సభ్యులు తెలిపారు.తక్షణమే స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించండి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: గ్రామీణ ఉపాధి పనులలో నాణ్యత పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, నర్సరీలు పెంపకంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సహకారం అందించాలన్నారు. వేతనదారుల ఆధార్ నంబర్లు బ్యాంక్ ఖాతాలతో అనుసంధానించాలని కోరారు. పనులను గుర్తించి ప్రతిపాదిస్తే మంజూరు చేస్తామన్నారు. గ్రంధాలయాల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అటవీ హక్కు పత్రాలు పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల వివరాలు నమోదు వేగవంతం చేయాలన్నారు. జగనన్న తోడుకు సంబంధించి వెనుకబడి ఉన్నందున సంబంధిత ఎపిఎంలు బాధ్యతను గుర్తించి నివేదిక అందించ చేయాలన్నారు. బహిరంగ మల విసర్జన గ్రామాలకు సంబంధించి పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో త్వరితగతిన టాయిలెట్లు పూర్తి చేయాలని, గ్రామాలలో కూడా వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు.స్వచ్ఛ భారత్ పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చేసిన పనులకు జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, లిక్విడ్ వ్యర్థ పదార్థాల నిర్వహణపై ప్రజలలో అవగాహన కల్పించి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీల ఆదాయం మెరుగుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సహాయ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డ్వామా, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు రమేష్ రామన్, వి.మురళి, పంచాయతీ అధికారులు కొండల రావు, ఐసిడిఎస్ కుమార్, ఎల్ డి ఎం రవితేజ, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు వి. అభిషేక్, సూరజ్ గనోరే, తహసీల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

రద్దీగా బ్యాంకులు

గ్రామీణవికాస బ్యాంకు వద్ద బారులు తీరిన జనం

నగదు విత్‌డ్రాకు జనం బారులు
గంటల తరబడి నిరీక్షణ...
వేసవితో తీవ్ర ఇక్కట్లు....

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలోని బ్యాంకులు జనాలతో తీవ్ర రద్దీగా ఉంటున్నాయి. పలు సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం చెల్లిస్తున్న నగదు సహాయం అందుకోవడానికి ఖాతాదారులు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. ఏజెన్సీలో మండల కేంద్రాల లోనే పలు బ్యాంకుల బ్రాంచీలు ఉన్నాయి. దీంతో మారుమూల గ్రామాల నుంచి గిరిజన లబ్ధిదారులు భారీగా బ్యాంకులకు కదిలి వస్తున్నారు. ప్రస్తుతం రైతు భరోసా కింద ప్రభుత్వం ఇస్తున్న నగదు చెల్లింపులను తీసుకునేందుకు వస్తున్న రైతులతో బ్యాంకులన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి. తరచూ అమ్మ ఒడి తో పాటు ఇతర సంక్షేమ పథకాలు కింద నగదు తీసుకోవడానికి వస్తున్న లబ్ధిదారులతో బ్యాంకులన్నీ నిత్యం రద్దీగా కనిపిస్తున్నాయి.

అధిక సంఖ్యలో ఖాతాదారులు బ్యాంకులకు వస్తున్న పరిస్థితి వల్ల కనీస సౌకర్యాలు కానరాని పరిస్థితి ఉంటుంది. బ్యాంకులో తాము వచ్చిన పనులు పూర్తి చేసుకోవడానికి ఖాతాదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. జిల్లా కేంద్రాల్లోని బ్యాంకుల్లో సైతం ఖాతాదారులు తమ పని పూర్తి చేసుకునే వరకు నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక పాడేరు ఏజెన్సీలోని చుట్టుపక్కల మండల కేంద్రాల్లో ఉండే బ్యాంకుల నిర్వహణకే సరైన వసతి సౌకర్యాలు లేవు. దీంతో, ఇక ఈ బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు తమ పనుల కోసం బ్యాంకుల ముందు మండుటెండలోనే బారులు తీరి నిలుచోవలసిన పరిస్థితి నెలకొంది. ఉపాధి పనులు చేసుకునే లబ్ధిదారులు, కాఫీ తోటలు, ఇతర వ్యవసాయ పథకాల లబ్ధిదారులు మహిళలు సైతం తమ ఆర్థిక అవసరాల నిమిత్తం బ్యాంకులకు నిత్యం వస్తున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలతో తమ గ్రామాల నుంచి బ్యాంకులకు వెళ్లి ఒక్కొక్కసారి నెట్ కనెక్టివిటీ లేకపోవడం, సర్వర్ డౌన్ వంటి సాంకేతిక సమస్యల కారణంగా బ్యాంకుల్లో చెల్లింపులు జరగక వెన్ను తిరగాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కసారి పేమెంట్లు కూడా పూర్తిస్థాయిలో జరగడం లేదని అంటున్నారు ఈ వేసవిలో మండుటెండలో బ్యాంకుల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకుల్లో కనీసం కూర్చోవడానికి బెంచీలు తాగడానికి మంచి నీళ్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు బ్యాంకుల ఖాతాదారులు కోరుతున్నారు.

జిమాడుగుల: మండల కేంద్రంలో ల గ్రామీణ వికాస బ్యాంకు కౌంటర్లను పెంచి వినియోగదారుల కష్టాలను తీర్చాలని లో ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వేలల్లో ఖాతాదారులు ఉన్నప్పటికీ సిబ్బంది తక్కువై కనీస సౌకర్యాలు లేవన్నారు. నెట్ సౌకర్యం సరిగ్గా లేక పోవడంతో మండుటెండలో గంటల తరబడి ఖాతాదారులు నిలబడాల్సిన అవసరం వస్తుందన్నారు. అధికారులు స్పందించి బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు నిలువు నీడ ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరారు

నేరాలు ఘోరాలు

అనుమానాస్పదంగా వివాహిత మృతి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామంలో ఓ వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు. బడిమెల గ్రామానికి చెందిన కిల్లో కళ(31) సోమవారం ఉదయం ఇంట్లో విగత జీవిగా పడి ఉండడంపై స్థానికులు సమాచారం అందించారన్నారు. గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని అరకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా లేక భర్త హత్య చేసాడనే దానిపై పోస్టుమార్టం నివేదికను బట్టి కేసును చేధించేందుకు ప్రయత్నాలు సాగిస్తామని ఆయన పేర్కొన్నారు. మృతిరాలికి ఐదేళ్ల కుమార్తెతో పాటు ఏడాదిన్నర కుమార్తె ఉన్నారు.

తన కూతురికి చిత్రహింసలకు గురి చేసి అల్లుడే కడతేర్చారని బాధిత మృతిరాలి తండ్రి కొర్రా శ్రీరాములు ఆరోపిస్తుంచారు. నాలుగు నెలల క్రితం కేరళ అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకుని తన అల్లుడు ఇంట్లో తీసుకొచ్చాడని చెప్పారు. నెల రోజులుగా తన కూతురు ఇంట్లోనే వచ్చి గడిపిందన్నారు. చిత్రహింసలకు గురి చేస్తున్నాడని, కూతురు చెప్పేదని ఊపిరి అడకుండా హత్య చేసి సాధారణ మృతిగా చిత్రీకరించి పరారీ అయ్యాడని ఆయన ఆరోపించారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్
ఆస్తుల అమ్మకం నిలిపివేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు హెచ్‌బి కాలనీ, ఆటోనగర్ పెదగంట్యాడ ప్రాంతాల్లో ఉన్న భూములను, ఆస్తులను అమ్మాలన్న నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఆస్తులను అమ్మి ప్లాంటును తాత్కాలికంగా నడిపించాలన్న ఆలోచన రోగమొకటైతే వైద్యం వేరొకటి చేసేదిగా ఉందని విమర్శించారు. స్టీల్‌ప్లాంటుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సొంతగనులు కేటాయించి, వర్కింగ్ క్యాపిటల్ ఇచ్చి, రైల్వేరేక్స్‌కు ఆటంకం లేకుండా చేస్తే ఏ ఆస్తులు అమ్మకుండానే ప్లాంటు లాభాల బాటపడుతుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి కేంద్రం ఇచ్చినది కేవలం రూ.4890 కోట్లు కానీ! స్టీల్‌ప్లాంటు నాటి నుంచి నేటి వరకు కేంద్ర ప్రభుత్వానికి పన్నులు, డివిడెంట్లు రూపంలో ఆదాయం సమకూర్చినది రూ.50 వేల కోట్లు అని వివరించారు. ప్రస్తుతం ప్లాంటుకు కావాల్సింది రూ.20వేల కోట్లు అని, ఈ మొత్తాన్ని సున్నావడ్డీకి కేంద్రం మంజూరు చేస్తే చాలు, ఏ ఆస్తులు అమ్మనవసరం లేదని పేర్కొన్నారు. దేశంలో ప్రభుత్వరంగం భిలాయి, రూర్కెలా, బొకారో, దుర్గాపూర్ స్టీల్‌ప్లాంటుకు సొంతగనులు కేంద్రం కేటాయించిందని, చివరకు ప్రయివేటు స్టీల్‌ప్లాంట్లు, టాటాస్టీల్, జిందాల్, బ్రాహ్మణీ స్టీల్, గాలి జనార్థనరెడ్డికి కూడా సొంతగనులు కేటాయించారని తెలిపారు. కానీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం కేటాయించడం లేదని పేర్కొన్నారు. దీని వల్ల ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి వైజాగ్ స్టీల్ అదనంగా రూ.2వేల పైన ఖర్చు చేయాల్సివస్తోందని వివరించారు. వైజాగ్ స్టీల్‌కు సొంతగనులిస్తే సంస్థ లాభాల్లో పరిగెత్తుతుందని తెలిపారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంటు విస్తరణకు కేంద్రం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని, సంస్థ తన సొంత వనరులు, రుణాలు ద్వారా రూ.18వేల కోట్లు సమీకరించుకొని 3.2 మిలియన్ మెట్రిక్ టన్నులు నుంచి 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులకు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుందని తెలిపారు. కానీ పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగనివ్వకుండా కేంద్రం అడ్డుకుంటోందని, కావాలనే నష్టాల్లోకి నెడుతోందని విమర్శించారు. ఏదో విధంగా ప్లాంటును, విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర ఆపడంలేదని పేర్కొన్నారు. విశాఖ గడ్డపై ఆదివారం కాలుమోపిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశాఖ ఉక్కుపై ప్రస్తావించికపోవడం ఈ కుట్రలో భాగమేనని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంటు, భూములు ప్రజల ఆస్తి అని, వీటిని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు తక్షణమే రూ.20వేల కోట్లు వడ్డీలేని రుణం, సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడవనివ్వాలని, రైల్వేరేక్స్‌కు ఆటంకాలు ఆపాలని, 8500మంది నిర్వాసితులకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ప్లాంట్ రక్షణకు కార్మికులు, ప్రజలు పోరాడుతున్నారని, రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు చిత్తశుద్ధితో కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్లాంటును రక్షించాలని, లేకుంటే మోడీ ప్రభుత్వానికి, బిజెపికి మద్దతిచ్చేవారికి ప్రజలు తగినశాస్తి చేయక తప్పదని హెచ్చరించారు.

నేలకొరిగిన భారీ వృక్షం

ట్రాఫిక్‌కు అంతరాయం

పోలీసుల ఆధ్వర్యంలో కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని సూరంపాలెం, రాజవొమ్మంగి రహదారి మధ్యలో జాతీయ రహదారి ఎన్‌హెచ్ 516ఈ పై సోమవారం భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రహదారి వెంబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో వృక్షాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులకు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సాదారణ శస్త్రచికిత్సతో శుక్ల అంథత్వ నివారణ

- డాక్టర్ ఫంకజ్ పరశురాం దోంగ్రే

ప్రజాశక్తి - ఆరిలోవ : అంధత్వానికి కంటిలో ఏర్పడే శుక్లంప్రధాన కారణమని, శుక్లం వల్ల వచ్చే అంధత్వాన్ని సాధారణ శస్త్రచికిత్స ద్వారా నివారించవచ్చని ఎల్.వి.ప్రసాద్ ఇనిస్టిట్యూట్, జిఎంఆర్ వరలక్ష్మీ క్యాంపస్ కన్సల్టెంట్ డాక్టర్ ఫంకజ్ పరశురాం దోంగ్రే అన్నారు. ప్రపంచ శుక్లాల మాసోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్‌వి ప్రసాద్ కంటిఆసుపత్రిలో కంటిలో శుక్లాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫంకజ్ మాట్లాడుతూ వయసు రీత్యా కంటిలో శుక్లాలు (కాటరాక్ట్) ఏర్పడటం సహజమన్నారు. ఇందుకు మధుమేహం, మూత్రపిండాల వ్యాధి, కంటి గాయాలు, ఇన్‌ఫెక్షన్లతో పాటు కొన్ని రకాల దీర్ఘకాలంగా మందులు మాడటం, పొగ తాగటం శుక్లాలు పెరగటానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చన్నారు. శుక్లం వచ్చే అంధత్వాన్ని సాధారణ శస్త్ర చికిత్స ద్వారా నివారించ వచ్చన్నారు. శుక్లం ప్రారంభదశలో కళ్ళద్దాలు మార్చుకుంటే కొంత ప్రయోజనం ఉన్నప్పటికీ, శుక్లం పెరిగే కొలదీ శస్త్రచికిత్స మాత్రమే సరైన ఎంపిక అవుతుందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం శుక్లాలు తిరిగి రావు, కానీ కాలానుగుణంగా మసక చూపు రావచ్చన్నారు. శుక్లాల శస్త్ర చికిత్సలో పురోగతి ఉన్నప్పటికీ, అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులచే శస్త్ర చికిత్స చేయించుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. శుక్లాల శస్త్రచికిత్స అనంతరం కనీసం 7 రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవడం అవసరమన్నారు.

బాల కార్మిక నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలకార్మిక నిర్మూలన అందరి బాధ్యతగా కృషి చేయాలని బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాష్ అన్నారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చినగదిలి తహశీల్దారు కార్యాలయం దరి ప్రభుత్వ బాలికల గృహంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ సమాజానికి బాల కార్మిక వ్యవస్థ ఒక సవాలుగా మారిందని, దీనికి ముఖ్యకారణం పేదరికం, అమాయకత్వం అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు చెందిన వారే బాల కార్మికులుగా ఉన్నారన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రస్తుతం ఉన్న చట్టాలను త్రికరణశుద్ధిగా ప్రభుత్వాలు అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాలికలకు పల్లురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. సమావేశంలో డాక్టర్ బాబ్జి, హాస్టల్ పర్యవేక్షణాధికారి ఎవి.సునీత, ఉపాధ్యాయులు రమణమ్మ, కె.సరస్వతి, జి.విజయలక్ష్మీ పాల్గొన్నారు.

కళాశాలల హాస్టల్ వర్కర్లను

యథావిధిగా కొనసాగించాలి

సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని విఆర్.పురం, కూనవరం, చింతూరు మండలాల్లో గత 20 సంవత్సరాలు నుండి కళాశాలల హాస్టళ్లలో వర్కర్లుగా పనిచేస్తున్న వారిని యథావిధిగా కొనసాగించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన హాస్టల్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలల హాస్టళ్లను ప్రారంభించినప్పుడు నుండి పనిచేస్తున్న వర్కర్లకు ఇంతవరకు ఉద్యోగ భద్రత ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమన్నారు. గతంలోనే సీఐటీయూ పోరాట ఫలితంగా కళాశాలల హాస్టళ్లలో 25 పోస్టులు మంజూరయ్యాయని, ఈ పోస్టులను కళాశాలలో పనిచేస్తున్న వర్కర్లకు ఇవ్వకుండా పక్కన ఆశ్రమ పాఠశాలలో ఉన్న వర్కర్లు తీసుకొచ్చి, కళాశాల హాస్టల్ వర్కర్లకు అన్యాయం చేయడం దారుణమన్నారు. దీనిపై అనేకసార్లు అడిగితే మీ పోస్టులు ఎటుపోవు, వాటిని మీతోనే భర్తీ చేస్తామని గతంలో ఉన్న డిడి, ఏటీడబ్ల్యూ చెప్పారని, కాని ఇంతవరకు ఆ పోస్టు వాళ్లకు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమన్నారు. చాలీచాలని వేతనంతో పని చేస్తున్న వర్కర్లకు అన్యాయం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు మంజూరైన 25 పోస్టులు ఎక్కడెక్కడ ఉన్నాయో, ఎవరితో భర్తీ చేశారు పరిశీలన చేసి వాటిని గతం నుండి పనిచేస్తున్న వర్కర్లతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల బుధవారం ఐటీడీఏ ముందు నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, కళాశాల హాస్టల్ వర్కర్లు రామ్మూర్తి. సుబ్బమ్మ లక్ష్మి, వెంకమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు ప్రమాద మృతులకు న్యాయవాదుల ఘననివాళి

నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : ఒడిశా రైలు ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని విశాఖపట్నంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ప్రధాన ద్వారం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ ప్రాణాల కోల్పోయిన వారి కుటుంబాలకు రైల్వే తరపున కేంద్ర ప్రభుత్వం ఇతోదికంగా ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకునే చర్యలు చేపట్లాని, అలాగే మృతుల కుటుంబాలకు చెందిన వ్యక్తులకు రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించాలని, ఇటువంటి దుర్ఘటనలు భవిష్యత్తులో జరగకుండా రైల్వే కవచ్ అనే వ్యవస్థను భారతదేశం అంతటా ఏర్పాటు చేయాలని, రైల్వేలో సరిపడా ఉద్యోగులను నియమించాలని, డిమాండ్ చేశారు. అలాగే మృతుల కుటుంబాలకు సరైన సహాయం అందని యెడల, వారికి విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఉచితంగా న్యాయ సహాయం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, పలకా శ్రీరామమూర్తి, న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొని నివాళులర్పించారు.

దళితుడిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : అంబేద్కర్ జయంతి నిర్వహించారని కక్ష కట్టి మహారాష్ట్రలో దళిత యువకుడు అక్షయ భలేరావును హతమార్చిన మరాఠా నిందితులను కఠినంగా శిక్షించాలని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.ప్రజ్ఞ మండిపడ్డారు. సోమవారం బుల్లయ్య కాలేజీదరి అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల ఒకటిన మహారాష్ట్ర నాందేడ్ జిల్లా బోందార్ హవేలీ గ్రామంలో తొలిసారిగా అంబేద్కర్ జయంతిని నిర్వహించారన్న కక్షతో అక్షయ భలేరావు అనే దళితుడిపై అదే గ్రామానికి చెందిన తొమ్మిది మంది మరాఠా కులస్థులు మారణాయుధాలతో దాడిచేసి హత్యచేశారన్నారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతిని జాతీయ ఉత్సవంగా జరుపుకుంటుంటే, అంబేద్కర్ సొంతరాష్ట్రం మహారాష్ట్రలో ఈ దారుణమేంటని ప్రశ్నించారు. హంతకులను కఠినంగా శిక్షించి, తద్వారా ఇలాంటి ఘటనలు ఇంకెక్కడా పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి గార సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బి. గౌతమ్ బాబు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎం.మల్లయ్య రాజు పాల్గొన్నారు

తేలికపాటి వర్షంతో ఉపశమనం

కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఎండ వేడితో అల్లాడిపోతున్న మన్యం వాసులు, సోమవారం మధ్యాహ్నం కురిసిన తేలికపాటి వర్షంతో ఉపశమనం పొందారు. పది రోజుల నుండి తీవ్రమైన ఎండలు, వడగాలులు, ఉక్కపోత, గతంలో ఎప్పుడూ లేని విధంగా మన్యంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఇక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఆకాశంలో కారు మబ్బులు కొమ్ముకొని ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోతతో అల్లాడుతున్న మన్యవాసులు సేదతీరినట్లు అయింది. ఈదురుగాలుల వల్ల విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రఘు కళాశాలలో అంతర్జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అడ్వాన్సెస్ ఇన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ అండ్ ఏంటీనా టెక్నాలజీస్ ఫర్ స్పేస్, వెహికలర్ అండ్ గ్రౌండ్ అప్లికేషన్స్ అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు కళాశాల సమావేశ మందిరంలో జరిగిన వర్క్ షాప్‌ను అమెరికాకు చెందిన రావూస్ కన్సల్టెంట్స్ సిఇఒ డాక్టర్ సుధాకరరావు ప్రారంభించారు. సదస్సుకు రఘు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇసిఇ విభాగాధిపతి ఆచార్య పి సతీష్ రామచౌదరి సమన్వయకర్తగా వ్యవహరించారు. అమెరికా, టర్కీ, తైవాన్, భారత్ దేశాలకు చెందిన సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, ఆచార్యులను భాగస్వాములను చేస్తూ ప్రత్యక్ష జ్ఞానాన్ని, అధునాతన సాంకేతికతలను పరిచయం చేస్తూ సదస్సు నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన అనంతరం డాక్టర్ సుధాకరరావు 'అడ్వాన్స్డ్ ఏంటీ నా డిజైన్స్ ఫర్ స్పేస్, ఎయిర్ గ్రౌండ్ కమ్యూనికేషన్స్ సింపుల్ ఈజ్ ఎలిజెంట్' అంశంపై ప్రసంగించారు.

బెంగుళూరుకు చెందిన క్వా డ్జెన్ వైర్లెస్ సంస్థ సిఇఒ సిఎస్ రావు, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ఇన్ పబ్లిక్ 5జి నెట్ వర్క్ ఆర్కిటెక్చర్ ' అంశంపై అమెరికా నాసా సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నసీర్ చాహట్, మార్స్ హెలికాప్టర్ కమ్యూనికేషన్ లింగ్ అండ్ ఇన్నోవేషన్ ఏంటినాస్ ఫర్ క్యూ బాట్స్, లాండర్స్, రోవర్స్ అంశంపై తైవాన్ వర్సిటీ ఆచార్యులు డెస్మొండ్ సిమ్, అమెరికాకు చెందిన డాక్టర్ గౌరంగి గుప్త, జెఎన్‌టియు ఆచార్యులు ఆర్ రమణారెడ్డి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. సదస్సు నిర్వహకులను,అతిథులను రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు అభినందించారు

స్మార్ట్ నానో టెక్నాలజీపై గీతంలో సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం, ఖతార్‌లోని ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలోని గీతం ప్రాంగణంలో అంతర్జాతీయ సదస్సునునిర్వహించనున్నాయని స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీకృష్ణ తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా శాస్త్రవేత్తలు ఈ అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానున్నారని తెలిపారు. సదస్సులో బయోమెటీరియల్స్, సోలార్ సెల్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, హైడ్రోజన్ ప్రొడక్షన్, స్మార్ట్‌నానో సెన్సార్స్, టిస్యూ ఇంజనీరింగ్, త్రిడి, 4డి ప్రింటింగ్, హైటెక్ డివైజస్, ఇనార్గానిక్, సాఫ్ట్‌మెటీరియల్స్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఉంటాయని సదస్సు కో కన్వీనర్ ప్రొఫెసర్ అనీమా దధిచి తెలిపారు. సదస్సులో పాల్గొనదలచిన వారు ఈనెల 15వ తేదీలోగా సదస్సు వెబ్‌సైట్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగంకో కన్వీనర్‌ను సంప్రదించాలని సూచించారు.